# ఎస్ఐఆర్ కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహణ

**చింతూరు, పెన్ పవర్, జూలై 13:** చింతూరు గ్రామపంచాయతీ పరిధిలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఆదివారం సంబంధిత బూత్ లెవల్ అధికారి (బీఎల్ఓ) ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 346, 347, 348, 349 బూత్‌ల పరిధిలో చేపడుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై చర్చించి, ఓటరు వివరాల పరిశీలన, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని బీఎల్ఓ కోరారు. ఈ సమావేశంలో బీఎల్ఓతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని



సమర్థవంతంగా అమలు చేసేందుకు తమ సహకారాన్ని అందిస్తామని తెలిపారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి




# కాటన్ బ్యారేజీ నూతన గేట్ల ఏర్పాటుకు సీఎం చంద్రబాబు శంకుస్థాపన

## రూ. 152 కోట్ల వ్యయం పనులకు శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు

**రాజమహేంద్రవరం పెన్ పవర్ జూలై 13:**
ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీకి రూ.152.95 కోట్ల వ్యయంతో 117 నూతన వరద గేట్ల ఏర్పాటు పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో సభాధ్యక్షులు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ప్రారంభోపన్యాసకులు డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా. నిమ్మల రామానా యుడు, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ మాధుర్ ప్రసంగించారు.

**డెల్టా రైతు బాంధవుడు సీఎం చంద్రబాబు : ఎమ్మెల్యే బండారు**

రాష్ట్ర అభివృద్ధి, రైతు సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న దూరదృష్టి కలిగిన నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు.

ముఖ్యమంత్రి రూ.152.95 కోట్లతో 117 వరద గేట్ల ఆధునీకరణ పనులను ప్రారంభించడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. కీలక సాగునీటి వ్యవస్థల నిర్వహణ, ఆధునీకరణ పనులకు గత కొన్నేళ్లుగా నిర్లక్ష్యం చేశారన్నారు.

సెంట్రల్ డెల్టా పరిధిలో రెండు లక్షల ఎకరాల సాగుభూములకు ఉపయోగపడే లొల్ల లాకుల నిర్మాణానికి రూ.74 కోట్ల నిధులు మంజూరు చేయడం ముఖ్యమంత్రి రైతుల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమన్నారు.

గోదావరి డెల్టా ఆధునీకరణ వేగవంతం , లంక భూములకు గ్రోయిన్ల ఏటిగట్ల ఎత్తు పెంపు, వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి, పిచ్చుకలంకను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడం వంటి అంశాలను



ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

**డెల్టా రైతాంగానికి శాశ్వత భరోసా : జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్**

డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాలకు సాగునీరు, తాగునీరు అందిస్తున్న ధవళేశ్వరం బ్యారేజీకి నూతన వరద గేట్ల ఏర్పాటు గోదావరి డెల్టా చరిత్రలో కీలక ఘట్టమన్నారు. ఈ పనులు పూర్తయితే సుమారు 10.13 లక్షల ఎకరాలకు సాగునీటి సరఫరా సమర్థవంతంగా సాగుతుందని తెలిపారు. రూ.152.95 కోట్లతో 117 గేట్ల మార్పిడికి శ్రీకారం చుట్టడం డెల్టా రైతాంగానికి శాశ్వత భరోసానిస్తుందని ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

**గోదావరి డెల్టా సాగునీటి రంగానికి పూర్వవైభవం: మంత్రి డా. నిమ్మల రామానాయుడు**

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా. నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ ధవళేశ్వరం బ్యారేజీ గోదావరి డెల్టాకు జీవనాడిని, కేంద్ర జల సంఘం సూచనల మేరకు బ్యారేజీ భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

117 గేట్లను రూ.152 కోట్లకు వ్యయంతో మార్చుతున్నట్లు తెలిపారు. సాగునీరు చివరి ఆయకట్టు వరకు చేరేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులకు 48 గంటల్లోనే ధాన్యం చెల్లింపులు చేస్తున్నామన్నారు.

**గోదావరి డెల్టా అభివృద్ధికి శాశ్వత నిర్ణయాలు: మంత్రి కందుల దుర్గేష్**

రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ గోదావరి డెల్టా రైతుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని 117 వరద గేట్ల పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు.

పిచ్చుకలంకలోని 62 ఎకరాల భూమిని సమగ్ర పర్యాటక అభివృద్ధికి వినియోగించుకునేలా జీవో సవరణలు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు.

**నిర్లక్ష్యానికి గురైన ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం : ఎంపీ గంటి హరీష్ మాధుర్**

అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ మాట్లాడుతూ రైతు సంక్షేమానికి, అభివృద్ధి కి ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

కొబ్బరి రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని, కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టును ముఖ్యమంత్రి సహకారంతో సాకారం చేస్తమని ఎంపీ హరీష్ మాధుర్ తెలిపారు.

# నాగేంద్రపురం,రామాపురం తదితర గ్రామాల్లోవైద్య బృందాలు పరిశీలన

**వి.ఆర్.పురం పెన్.పవర్.జూలై.13**
ఉమ్మడివరం గ్రామంలో ఇటీవల విషజ్వరాలు,డెంగ్యూ కేసులు నమోదవుతున్న,నేపథ్యంలో రేఖపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)వైద్యాధికారి డాక్టర్ నీలోఫర్ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి,జ్వర లక్షణాలతో బాధపడు తున్న వారికి అవసరమైన మందులు అందజేశారు. గ్రామంలో పరిశుభ్రత పాటించడం,నీరు నిల్వ ఉండకుండా చూడడం, దోమల నివారణ చర్యలు చేపట్టడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే మలేరియా ప్రభావిత గ్రామాలైన నాగేంద్రపురం,రామాపురం,బూరు గువాడ గ్రామాల్లో వైద్య బృందాలు ఇంటిం టికీ వెళ్లి ఆరోగ్య పరిస్థితులను పరిశీలించాయి. దోమల నివారణ కోసం యాంటీ లార్వా స్ప్రే,ఫాగింగ్ నిర్వ హించడంతో పాటు అనుమానితులకు రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేశారు. బీపీ,మధు మేహంతో బాధ పడుతున్న రోగులకు మందులు పంపిణీ చేసి,మరింత చికిత్స అవసరమైన వారిని ఆసుపత్రికి రిఫర్ చేశారు. దోమలద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టేందుకు ఉమ్మడివరం గ్రామ ప్రజలకు దోమతెరలు పంపిణీ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా డెంగ్యూ ,మలేరియా వంటి వ్యాధులను నివారించ వచ్చని, వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో రేఖపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నీలోఫర్,జీడిగుప్ప వైద్యా ధికారి డాక్టర్,పృథ్వీ,రేఖపల్లి ఆసుపత్రి హెల్త్ సూపర్‌వైజర్ పీ.భద్రకాళి,వైద్య సిబ్బంది.నూప పవన్ కళ్యాణ్,రత్తయ్య ,శ్రీనివాస్,సత్యనారాయణ,సతీష్,పార్వతి,లక్ష్మి,చంద్రమ్మ,



మంగ,సోడీ విజయకుమారి,పంచాయతీ కార్యదర్శి,గ్రామ స్థులు తదితరులు పాల్గొన్నారు.




01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 150 అర్జీలు

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 13:** కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్. భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో మొత్తం 150 అర్జీలు స్వీకరించారు. ప్రజలు వినతిపత్రాలను సంబంధిత శాఖల అధికారులకు అందజేయగా, వాటిని సకాలంలో పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలు కలెక్టరేట్‌కు రావాల్సిన అవసరం లేకుండా 1100 టోల్ ఫ్రీ నంబర్, 'మీకోసం' పోర్టల్, గ్రామ, వార్డు సచివాలయాలు కూడా అర్జీలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి అర్జీని నిర్దేశిత గడువులోగా పరిష్కరించేలా అధికారులు దృష్టి సారించాలని సూచించారు. శాఖల వారీగా అందిన అర్జీల్లో రెవెన్యూ (రెవెన్యూ క్లినిక్)కు 61, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు 35, హోం శాఖకు 19, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, మత్స్యశాఖకు 7, ఇంధన శాఖకు 4 అర్జీలు అందాయి. జలవనరులు, పురపాలక పట్టణాభివృద్ధి, వ్యవసాయ ,సహకార, వైద్య, ఆరోగ్య, మహిళా, శిశు సంక్షేమ, నైపుణ్యా భివృద్ధి శిక్షణ, పాఠశాల విద్య, స్వర్ణ గ్రామం--స్వర్ణ వార్డు , గృహనిర్మాణం తదితర శాఖలకు కూడా అర్జీలు అందాయన్నారు.

రెవెన్యూ క్లినిక్‌లో అర్జీలను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆర్.ఎం.ఎం. ప్రేమ్ కుమార్, పి. భాగ్యలక్ష్మి స్వీకరించి సంబంధిత అధికారులకు పంపించారు.



# ఏపీ నిట్ లో ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం (ఎఫ్‌డీపీ) ప్రారంభం





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. జూలై 13:** నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్)లోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో కంబషన్ ఇంజిన్ సాంకేతికతల్లో ప్రయోగాత్మక, గణనాత్మక మరియు సుస్థిర దృక్కోణాలు" అనే అంశంపై ఐదు రోజులపాటు నిర్వహించనున్న ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం (ఎఫ్‌డీపీ) సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ జి.సంతోష్ కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి ఆన్లైన్ ద్వారా మాట్లాడుతూ శక్తి ఉత్పత్తి, రవాణా, పారిశ్రామిక రంగాల్లో కంబషన్ ఇంజిన్ సాంకేతికతలు కీలకపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఈ కంబషన్ ఇంజిన్ సాంకేతికతల్లో ఆధునిక పరిశోధనలు, గణనాత్మక విశ్లేషణలు, పర్యావరణహిత సాంకేతిక విధానాలపై ఆచార్యులు, పరిశోధకులు అవగాహనను పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ద్వారా దేశంలోని ప్రముఖ నిపుణులు పలు అంశాలపై శిక్షణ అందించనున్నారని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. డీన్లు డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి, డాక్టర్ వి.సందీప్, డాక్టర్ జీబీ.వీరేష్ కుమార్ మాట్లాడుతూ ఆచార్యుల నైపుణ్యాభివృద్ధికి ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. కంబషన్ ఇంజిన్ సాంకేతికతల రంగంలో చోటుచేసుకుంటున్న తాజా పరిశోధనలు, గణనాత్మక నమూనాలు, సుస్థిర సాంకేతిక పరిజ్ఞానంతోపాటు వివిధ సాంకేతిక అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి కో ఆర్డినేటర్ గా వ్యవరించిన ఆచార్యురాలు డాక్టర్ సునీతా దేవ్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## ఎస్సీ నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 13**
ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఎస్సీ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో పలు నైపుణ్య శిక్షణ ను అమలు చేయనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులముల సహకార సంఘం కార్యనిర్వాహక సంచాలకులు జి. గౌరీ శంకరరావు సోమవారం తెలిపారు. ఇస్రాయెల్‌లో హోమ్ బేస్డ్ కేర్ గివర్‌గా ఉద్యోగాలు పొందేందుకు 25 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి జి డి ఎ, ఏ ఎన్ ఎం, జి ఎన్ ఎం బీఎస్సీ నర్సింగ్ లేదా పోస్ట్ బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన అభ్యర్థులకు సి ఇ ఎఫ్ఆర్ బి 2 స్థాయి ఇంగ్లిష్ భాషా నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ఇస్రాయెల్‌లో ఉద్యోగం పొందే అవకాశం ఉండగా, నెలకు సుమారు రూ.1.99 లక్షల వరకు వేతనం పొందే అవకాశం ఉందన్నారు. 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఉత్తీర్ణులై, ఆయా కోర్సులకు అర్హతలు, అనుభవం కలిగిన ఎస్సీ యువత కోసం కిసాన్ డ్రోన్ ఆపరేటర్, డ్రోన్ సర్వీస్ టెక్నీషియన్, అసిస్టెంట్ ఎలక్ట్రిషియన్, సోలార్ పీవీ ఇన్‌స్టాలర్ (సూర్యమిత్ర), ఎలక్ట్రిక్ వెహికల్ మెయింటెనెన్స్, బ్యూటీ థెరపిస్ట్, ప్లంబర్ (జనరల్) తదితర కోర్సుల్లో ఉచిత నైపుణ్య శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు.ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు తమ మండల లేదా మున్సిపల్ కార్యాలయాలతో పాటు కాకినాడలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో 93989 07208, 98855 82325 నంబర్లకు సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకో వచ్చన్నారు. దరఖాస్తులను సంబంధిత వెబ్ లింకుల ద్వారా లేదా మండల, మున్సిపల్ కార్యాలయాల్లో పొందవచ్చని, పూర్తి చేసిన దరఖాస్తుతో పాటు కుల ధృవీకరణ పత్రం, విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్, రేషన్ కార్డు ప్రతులను జతచేసి మూడు రోజుల్లోగా స్వయంగా లేదా ఇ-మెయిల్‌కు పంపించాలని సూచించారు.

## అసహనంతోనే కూటమిపై దుష్ప్రచారం: ఎమ్మెల్యే బొలిశెట్టి





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. జూలై 13:** కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. కూటమి కి లభిస్తున్న ప్రజాదరణను చూసి అసహనంతో వైసీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తాడేపల్లిగూడెం మండలం పెద్ద తాడేపల్లి గ్రామంలో రహదారి నిర్మాణ పనులను ఎమ్మెల్యే సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదతాడేపల్లి అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. గ్రామంలోని మేకల సంతను అభివృద్ధి చేసి, దాని ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రామాభివృద్ధి పనులకు వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఈ నిధులతో ఇప్పటికే సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల రహదారి నిర్మాణం పూర్తయిందని, మిగిలిన మూడు కిలోమీటర్ల రోడ్డు పనులను కూడా త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనల మేరకు గ్రామాల్లో ఐదు మీటర్ల వెడల్పుతో లింక్ రోడ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. పెదతాడేపల్లిలో మిగిలిన అభివృద్ధి పనులన్నింటినీ దశలవారీగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమాంతరంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన "సిక్స్ ప్యాక్" హామీల్లో అధిక శాతం ఇప్పటికే అమలు చేశామని తెలిపారు. పెన్షన్లు, సంక్షేమ పథకాలపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిని ప్రజలు నమ్మవద్దని సూచించారు. పోలవరం ప్రాజెక్టు, అమరావతి అభివృద్ధి, గ్రామీణ రహదారుల నిర్మాణం వంటి కీలక పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలను రాజకీయాలకు ముడిపెట్టడం సరికాదని, వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం వల్ల అసాధారణ పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఎమ్మెల్యే బొలిశెట్టి అన్నారు. ఎల్ నినో వంటి ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునేందుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం చేపడుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# అప్పన్న ఆశీస్సులతో అభివృద్ధి సాధిద్దాం :ఎమ్మెల్యే బొలిశెట్టి





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జులై 13.** సింహాద్రి అప్పన్న ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, రాష్ట్రం అభివృద్ధి సాధించాలని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ ఆకాంక్షించారు. విశాఖపట్నం సింహాచలం దేవస్థానం, శ్రీ వరాహ లక్ష్మి నరసింహస్వామి వారిని ఆదివారం ఎమ్మెల్యే కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, శాలువాతో సత్కరించి, వేద ఆశీర్వచనం, స్వామివారి ప్రతిమను, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జనసేన అధ్యక్షులు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆయు రారోగ్యాలతో ప్రజలకు సేవలు అందించాలని లక్ష్మీ నరసింహ స్వామిని ప్రార్థించానని అన్నారు. రాష్ట్రంలో కూటమిప్రభుత్వం ప్రజల సంక్షేమానికి,రాష్ట్ర అభివృద్ధికి చేస్తున్న కృషికి స్వామివారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. భారతీయ సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణకు, సనాతన ధర్మ ఆచరణ పై ప్రజలలో అవగాహన కల్పించేందుకు సింహాచలం తదితర శక్తి వంతమైన దేవస్థానాలు కేంద్రాలుగా నిలిచాయని అన్నారు. తరతరాలుగా ఆధ్యాత్మిక చైతన్యాన్ని అందిస్తున్న పుణ్యక్షేత్రాల సందర్శన భారతీయ జీవన విధానాల్లో ఒక ముఖ్య భాగమని అన్నారు. ఈ కార్యక్రమంలోకూటమి నాయకులు పాల్గొన్నారు.

# జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం




**రాజమహేంద్రవరం పెన్ పవర్, జూలై 13:** ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి డా. హరిప్రసాద్, అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డా. హరిప్రసాద్ మాట్లాడుతూ, జనాభా నియంత్రణలో ప్రతి ఒక్కరికీ బాధ్యత ఉందన్నారు. వివాహిత దంపతులు కుటుంబ నియంత్రణకు సంబంధించిన తాత్కాలిక, శాశ్వత పద్ధతులపై అవగాహన కలిగి తప్పనిసరిగా పాటించాలని సూచించారు. తల్లి, శిశువు ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని బిడ్డకు బిడ్డకు మధ్య కనీసం మూడు సంవత్సరాల వ్యవధి ఉండేలా తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులను అనుసరిం చాలని తెలిపారు.
ఈ సందర్భంగా "ప్రణాళికాబద్ధ మాతృత్వం కోసం గర్భధారణల మధ్య ఆరోగ్యకరమైన విరామం -- అవాంఛిత గర్భధారణపై ముందస్తు చర్యలు తల్లి, బిడ్డల క్షేమానికి తోడ్పడతాయి" అనే నినాదంతో అవగాహన ర్యాలీ నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో గణాంక అధికారి జె. కుమారస్వామి, డిప్యూటీ డెమో పి. సత్యవతి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## - రూ.20 లక్షల సిఎస్ఆర్ నిధులతో నిర్మించిన గదులు ప్రారంభం




ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

**రాజమహేంద్రవరం :** సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. రూ. 20 లక్షలతో సిఎస్ ఆర్ నిధులతో చేపట్టిన మోరంపూడి స్పెషల్ మున్సిపల్ పాఠశాలలో ప్రారంభించిన 9, 10వ తరగతి గదులు, రెస్ట్ రూమ్లు నిదర్శనమన్నారు. స్థానిక మోరంపూడి సిటీ స్పెషల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రాథమిక - ఉన్నత పాఠశాలలో ఏపీ పేపర్ మిల్లు సిఎస్ ఆర్ నిధుల ద్వారా రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన 9వ, 10వ తరగతి గదులు, విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, బెంచీలు, బాలికల కోసం విశ్రాంతి గది (రెస్ట్ రూమ్) తదితర అభివృద్ధి పనులను సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) ప్రారంభించారు. ప్రధానో పాధ్యాయులు కొత్త సమస్యను తన దృష్టికి తీసుకొచ్చారని, 9వ, 10వ తరగతులు ప్రారంభమైనా సరిపడా తరగతి గదులు లేవని చెప్పారని వివరించారు. తమ విజ్ఞప్తికి ఏపీ పేపర్ మిల్స్ యాజమాన్యం సానుకూలంగా స్పందించి తమ సిఎసఆర్ ద్వారా రూ.20 లక్షలతో తరగతి గదులు, బెంచీలు నిర్మించారు. ఈ కార్యక్రమంలో పేపరు మిల్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బిజయ్ కుమార్ సంకృ, 10వ డివిజన్ ఇన్‌ఛార్జ్ చొప్పెర్ల వీరభద్రరావు, ప్రెసిడెంట్ పంచిట్ల శివప్రసాద్, కార్యదర్శి వాసంశెట్టి బుజ్జి, కోండ్రపు అప్పారావు, రాయి లక్ష్మణరావు, అలమండ పార్వతి, కుమారి, రమణ, కూటమి నాయకులు, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణపై మోతుగూడెం పోలీసుల అవగాహన సదస్సు




**చింతూరు, పెన్ పవర్, జూలై 13:** మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని గొందిగూడెం గ్రామం, కొత్తపల్లి పంచాయతీలో మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, రోడ్డు భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలన, గంజాయి అక్రమ రవాణా, వినియోగం నివారణపై మోతుగూడెం పోలీసులు సోమవారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చింతూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్. గోపాలకృష్ణ మాట్లాడుతూ మహిళలపై జరిగే నేరాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు. ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అపరిచితుల ఫోన్ కాల్స్, లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. రోడ్డు భద్రతపై మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, వాహనం నడుపుతూ సెల్‌ఫోన్ వినియోగం వంటి చర్యలకు దూరంగా ఉండాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చన్నారు. మోతుగూడెం ఎస్ఐ అబ్దుల్ నాసిర్ హుస్సేన్ మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో నేరరహిత, మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్ఐ సీహెచ్. కృష్ణ, మోతుగూడెం పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామస్తులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో హాజరై అవగాహన కార్యక్రమాన్ని ఆసక్తిగా వీక్షించారు.

